క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ

త్రిపురాంతకం: ఆషాడ పౌర్ణమి సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చిన భక్తజనులు గిరి పదక్షిణ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి నెలా పౌర్ణమినాడు గిరి ప్రదక్షిణ జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా నిద్ర చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయాల వద్ద భక్తులకు ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు.

బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్

తాళ్లూరు: బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండి నూతన ఓటర్ల నమోదు చేయాలని దర్శి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) జాన్సన్ కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్వోలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈఆర్వో మాట్లాడుతూ బీఎల్వోలు ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలు పాటించాలని చెప్పారు. యాప్‌ల గురించి, ఆర్పీ యాక్ట్ 1950 సెక్షన్ల గురించి శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్షను నిర్వహించి సర్టిఫికెట్స్ అందజేశారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ టి.దేవప్రసాద్, మాస్టర్ ట్రైనర్ టి.రవిచంద్ర పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పీటీఎంలు

- అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలలు
- విద్యా ప్రమాణాలకు తిలోదకాలు


కురిచేడు: మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు

కురిచేడు:

ప్రభుత్వం చేపట్టిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలు తూతూమంత్రంగా జరిగాయి. ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వరరావు మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉప విద్యాశాఖాధికారి హాజరైన పాఠశాలల్లో కూడా విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దగా లేకపోవటం విశేషం. మండలంలోని కొన్ని పాఠశాలలకు మాత్రమే విద్యార్థుల తల్లిదండ్రులు ఒక మోస్తరుగా హాజరయ్యారు. ఎక్కువ పాఠశాలల్లో వేళ్ల మీద లెక్క పెట్టే విధంగా పేరెంట్స్ హాజరయ్యారు. అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులతో పేరెంట్స్ డే కార్యక్రమాలు ముగించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో సుమారు 200 మందిపైగా విద్యార్థులున్నా తల్లిదండ్రులు మాత్రం 10 శాతం మాత్రమే హాజరు కావటం విశేషం. పాఠశాలల్లో ఉపాధ్యాయులను సక్రమంగా నియమించకుండా, విద్యార్థులకు ఇవ్వాల్సిన పుస్తకాలు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా, తల్లికి వందనం నగదు అర్హులందరికీ రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంపై పెద్దగా ఆసక్తి చూపలేదు.

దర్శి: వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు మెగా పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్)ల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో సంబరాలు చేయడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో తగ్గిపోయారు. ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ ఘోరంగా విఫలమైందని అందరికీ తెలిసిపోయింది. దీంతో మెగా పీటీఎంల పేరుతో పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను పిలిపించి వారి ఎదుట తమ పాఠశాలలు గొప్పగా ఉన్నాయని అభం శుభం తెలియని పిల్లలతో చెప్పిస్తున్నారు. మరి కొందరితో బలవంతంగా చెప్పించడంపై తల్లి దండ్రులు ముక్కున వేలేసుకుంటున్నారు. వాస్తవానికి గత సంవత్సరం తల్లికి వందనం కింద రూ.15 వేలు వేయాల్సి ఉండగా వేయలేదు. ఈ సంవత్సరం రూ.15 వేలు వేయాల్సి ఉండగా రూ.13 వేలు మాత్రమే వేసి రెండు వేలు మెయింటెన్స్‌కు అని కోత పెట్టారు. అలాగని అందరికీ డబ్బులు పడక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో ఉన్నారు. రెండు వేలు తగ్గించినా పాఠశాలల్లో ఎటువంటి మెయింటెన్స్ చేపట్టడం లేదు. మధ్యాహ్న భోజనం అధ్వానంగా తయారైంది. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించడం లేదు. ఇవన్నీ కప్పి పుచ్చుకునేందుకు తల్లిదండ్రులను పిలిచి మెగా పీటీఎంల పేరుతో ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడవం పలు విమర్శలకు తావిస్తోంది. అసలు ఏం చేశారని ఈవెంట్లు పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఈవెంట్లు ఏర్పాటు చేసేందుకు పిల్లల వద్ద రూ.200 వరకు వసూలు చేసినట్లు సమాచారం. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తిట్టుకుంటూ ఖర్చు భరాయిస్తున్నారని గుసగుసలాడుకుంటున్నారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు కింద నిలిచిపోయిన పనులను కూడా నేటికీ ప్రారంభించకుండా సంవత్సరంలో తామేదో సాధించినట్లు తల్లిదండ్రులతో మీటింగ్‌లు ఏర్పాటు చేయడంపై పలు విమర్శలకు తావిస్తోంది. స్కూల్ బ్యాగులు నాసిరకంగా ఉన్నాయని, అవి ఇప్పటికే చిరిగి పోతున్నాయని విద్యార్థులే చెప్తున్నారు. దీనికి తోడు కొందరు విద్యార్థులను ఎంపిక చేసి ఇంగ్లిష్‌లో మాట్లాడించడంపై గత జగన్ ప్రభుత్వంలో ఇంగ్లిష్ మీడియం వద్దన్న ప్రభుత్వ పెద్దలకు చెంప పెట్టుగా మారింది. అప్పట్లో జగన్ హయాంలో ఇంగ్లిష్ నేర్చుకున్నారు కాబట్టే విద్యార్థులు ఇప్పుడు సులభంగా ఇంగ్లిష్ మాట్లాడుతున్నారని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. హాజరైన తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించి ఆ పార్టీ మద్దతుదారులతో స్టేజీలపై చంద్రబాబు, లోకేష్‌లను పొగిడించి మాట్లాడేలా తర్ఫీదు ఇచ్చి మరీ మాట్లాడించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ పాఠశాలలో చూసినా తల్లిదండ్రులకు గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, విద్యార్థులు కూర్చునేందుకు నాణ్యమైన బల్లలు, పాఠశాలల పెయింటింగ్‌లు, టైల్స్‌తో అందంగా నిర్మించిన బాత్‌రూంలే కనిపించడంపై ఇప్పుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేసిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గత జగనన్న పాలనలో విద్యావ్యవస్థ అద్భుతంగా ఉందని ఈ మీటింగ్‌లే నిరూపిస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు.

మొక్కుబడిగా తల్లిదండ్రుల సమ్మేళనం

దొనకొండ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం మొక్కుబడిగా కొనసాగింది. కొంతమంది తల్లిదండ్రులు సమావేశానికి రాలేదు. మరి కొంతమంది తల్లిదండ్రులు తల్లికి వందనం లబ్ధి చేకూరక పోవటంతో సమావేశానికి ఎందుకు పోవాలనే ఆలోచనలతో పాఠశాలలకు వెళ్లలేదు. ఉపాధ్యాయులు మాత్రం హడావుడి చేశారు. ఆర్భాటం మూరెడు ఆచరణ జానెడు అన్నట్లు కూటమి ప్రభుత్వం తల్లిదండ్రుల సమావేశం నీరుగారి పోయింది. మండల టీడీపీ నాయకులు మాత్రం తమ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి వస్తున్నారని కొద్దిమేర పాఠశాలల్లో హడావుడి చేశారు. ఉదయం 10 గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా టీడీపీ ఇన్‌చార్జి రాలేదని ఒంటి గంటకు ప్రారంభించారు. అంతవరకు విద్యార్థులు భోజనం చేయకుండా అలాగే ఉండిపోయారు. తల్లిదండ్రుల సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. ప్రచార ఆర్భాటమే తప్ప విద్యార్థులకు ఒరిగింది శూన్యం.

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: లైంగిక వేధింపులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా, ఎవరి నుంచైనా వేధింపులు ఎదురైతే ఆందోళన చెందకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు నిర్భయంగా తెలియజేయాలని ఎస్‌ఐ సంతపేకుమార్ సూచించారు. ఎస్పీ దామోదర్ ఆదేశాలపై ప్రతి పాఠశాలలో అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముటుకుల సిద్దార్థ పాఠశాలలో గురువారం విద్యార్థులకు లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ముందుగా గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహ కల్పించడంతో పాటు ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు, యువకులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సైబర్ నేరాలు, ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, లింక్ మేసేజ్‌లు, తాజాగా డిజిటల్ అరెస్టులు పేరుతో జరుగుతున్న మోసాలు తెలిపారు. దీంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అత్యవసరం అనుకుంటే వెంటనే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సాయం తీసుకోవాలని సూచించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


సర్పంచ్ వెంకయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి: ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన తానంచింతల సర్పంచ్ ఎర్రగుంట్ల వెంకయ్యను, అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ కుమారుడు జిర్రా ఏసురత్నాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ


సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

దర్శి: లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి టౌన్ ఆధ్వర్యంలో తూర్పు చౌటపాలెం జెడ్పీహెచ్ స్కూల్‌కు రూ.25 వేల విలువైన కుర్చీలు, కూలింగ్ ఫ్రిడ్జ్, ప్రింటర్ బహూకరించారు.. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆవులూరి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కూడా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు విస్తరింపజేస్తామని తెలిపారు. సెక్రటరీ ఇన్నమూరి రాము, లయన్స్ క్లబ్ సభ్యులు మానం రామాంజనేయులు, పాపిశెట్టి సత్యనారాయణ, బూదాటి ఆంజనేయులు, గన్నమనేని శ్రీనివాసరావు, కోటా హనుమంతురావు, జె.సుశీల, షేక్ ఖాసీం, మాడపాకుల బాలు, అప్పికట్ల ఆదినారాయణ, బొల్లినేని ఈశ్వరరావు, పరిటాల సురేష్, ప్రధానోపాధ్యాయులు సీతమ్మ పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీ హయాంలోనే విద్యాభివృద్ధి


కొమరోలులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు

కొమరోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు, విద్యకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు పేర్కొన్నారు. గురువారం కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి పథకం అమలు చేయడం, నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరాజు, మాజీ వైస్ ఎంపీపీ నాదెళ్ల పెద్దసుబ్బరాయుడు, ఎంఈఓ–2 బొర్రా వెంకటరత్నం, హెచ్ఎం శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం


గిద్దలూరు : అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

గిద్దలూరు రూరల్: కక్షిదారులు మధ్యవర్తిత్వంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన దేశం కోసం మధ్యవర్తిత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించుకోవడం కోసం మధ్యవర్తిత్వం అంశాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఇరు పార్టీలతో సమన్వయం ఏర్పరచడంలో మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో కిలోమీటరు నడక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ జడ్జి కె.భరత్‌చంద్ర, న్యాయవాదులు శేషశయనారెడ్డి, సంగీతరావు, భాస్కరరావు, హిమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు


పెద్దదోర్నాలలో ప్రత్యేక పూజల్లో భక్తులు


ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

దర్శి: నియోజకవర్గంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రధానంగా దర్శి మండలం సాయిబాబా ఆలయాల్లో సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. పట్టణంలోని నాగసాయి దత్తాశ్రమం, శ్రీ షిర్డీ సాయి సేవాశ్రమం, పొదిలి రోడ్డు సాయిబాబా ఆలయం, సాయి ధ్యాన మందిరం, అద్దంకి రోడ్డులోని సాయిబాబా ఆలయం, లంకోజనపల్లి రోడ్డులోని సాయి బాబా ఆలయాల్లో అన్నదానం చేశారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బూచేపల్లి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు శివనాగసాయి దత్తాశ్రమం, అద్దంకి రోడ్డులోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. బూచేపల్లికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దదోర్నాల: గురుపౌర్ణమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. గురుపౌర్ణమి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాబాను దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు తరలి రావటంతో మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడింది. బాబా దివ్య దర్శనం చేసుకున్న భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. గురుపౌర్ణమి వేడుకల్లో శ్రీ షిర్డీసాయి సత్సంగ మందిరంలో వేకువ జామున బాబాను పట్టువస్త్రాలు ప్రత్యేక పూలమాలలతో అలంకరించారు. తెల్లవారు జామున 5 గంటలకు కాగడ హారతి అనంతరం పాలతో బాబాను అభిషేకించారు. ఆలయ అర్చకులు, భక్తులతో సాయి సత్యవ్రతం, పూజా క్రతువు, వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పుర ప్రముఖులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుల్లలచెరువు: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని ఉమ్మడివరం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి శంకర్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: గురుపౌర్ణమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురిచేడులోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి పోతిరెడ్డిపల్లి రవిశాస్త్రి భక్తులతో ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు అభిషేకం, 9 గంటలకు అర్చన, 10 గంటలకు సామూహిక అభిషేకాలు, దర్శనం, 12 గంటలకు హారతి, అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. దర్శి రోడ్డులోని శ్రీ కాశీనాయన ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


స్వామి వారి పూజకు హాజరైన భక్తులు


అన్నదానానికి హాజరైన భక్తులు

దొనకొండ: గురుపౌర్ణమి వేడుకలు భక్తులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్త్రీలు తలంటి స్నానాలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక బ్రహ్మరావుపేటలో వెలసిన శ్రీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో స్త్రీలు పాల్గొని ఉదయం నుంచి గణపతి పూజ, ప్రత్యేక పూజలు, పుణ్యహ వాచనం, సాయిబాబాకు అభిషేకాలు, సహస్రనామ పుష్పార్చనలు నిర్వహించారు. ఇతర గ్రమాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో రాత్రికి భక్తి పాటలతో భజన నిర్వహిస్తారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆనంద ఆశ్రమంలో..

గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆనంద ఆశ్రమంలో గోవిందమాంబ శ్రీ వీరబ్రహ్మేంద్రుల స్వాముల వారికి పంచామృత అభిషేకాలు, అచలానంద గురుదేవుల వారి చిత్ర పటానికి ప్రత్యేక అలంకరణ చేసి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భైరవానంద స్వామి వారికి భక్తులు పాద పూజ చేశారు. పూజా కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రథోత్సవానికి హాజరైన భక్తులు


దొనకొండ: సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

తాళ్లూరు: మండలంలోని కొత్తపాలెం, నాగంబొట్లపాలెం, వెలుగువారిపాలెం సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొత్తపాలెం సాయిబాబా ఆలయల ట్రస్ట్ ఆధ్వరంలో 6 వేల మందికి అన్నదానం చేశారు.

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో గురుపౌర్ణమి సందర్భంగా షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు సాయిబాబాకు ఉదయం కాకడ హారతి, గణపతి పూజ, ప్రాతః కాలపూజలు, పుణ్యాహవాచనం, హారతులు, క్షీరాభిషేకం, సహస్రనామ పుష్పార్చనలు, మంత్రపుష్ప, అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం రథంపై సాయిబాబా ఉత్సవ విగ్రహం ఆశీనులైన అనంతరం భక్తులు భక్తి పాటలతో భజనలు చేస్తూ వీధుల్లో ఊరేగింపు చేశారు. రథోత్సవంలో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెద్దారవీడులో ఆంజనేయస్వామి దేవాలయం, రాజా విద్యాశ్రమం, బద్వీడుచెర్లోపల్లి బ్రహ్మంగారి దేవాలయం భక్తులకు అన్నదానం చేశారు. పెద్దారవీడులో ట్రాక్టర్‌పై సాయిబాబా చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి


రమాదేవి (ఫైల్)


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ చిత్తూరి హారిక

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అచ్యుత రమాదేవి (40) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమాదేవి మృతి చెందిన సమాచారం అందుకున్న పంచాయితీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, సర్పంచ్ చిత్తూరి హారిక, ఉపాధ్యాయులు హుటాహుటిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని నివాళులర్పించారు.